నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శనివారం 26 అక్టోబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో అధికారులు కూల్చివేసిన పేదల ఇండ్లు(ఫైల్)

ప్రశ్నించినందుకే ప్రతీకారం!

- మాజీ మంత్రి తమ్ముడి అరెస్ట్‌పై నిరసనల వెల్లువ
- దివ్యాంగులకు అండగా నిలిచినందుకే.. కక్షపూరితంగా కేసులు
- మహబూబ్‌నగర్ రూరల్ పోలీసుల అత్యుత్సాహం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఆగస్టు 29న దివ్యాంగులు, పేదలకు చెందిన 75 ఇండ్లను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుల్డోజర్లతో కూల్చివేసిన ఘటనపై నిలదీసినందుకు బీఆర్ఎస్ నేతలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారు. గతంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు ఫోర్జరీ సంతకాలు పెట్టి బోగస్ పట్టాలు సృష్టించారని సాక్షాధారాలతో కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసిన విషయం విదితమే. దీన్ని ఆసరాగా చేసుకొని పేదల ఇండ్లను అక్రమంగా కూల్చివేసి.. వారిని ఆదుకొని అన్నం పెట్టారన్న కక్షతో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తమ్ముడు శ్రీకాంత్‌గౌడ్‌ను కేసులో ఇరికించారు. సాక్షాధారాలు లేకున్నా మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి శ్రీకాంత్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఆయన పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పెట్టిన కేసు అక్రమమని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో మంత్రిగా పనిచేసిన శ్రీనివాస్ గౌడ్‌తలుచుకుంటే జీవో నెంబర్ 58 ప్రకారం పేదల ఇండ్లు రెగ్యులరైజ్ చేసి ఇచ్చే వారని.., బోగస్ పత్రాలు సృష్టించాల్సిన అవసరమేమిటని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ నేతల డైరెక్షన్‌లో రూరల్ సీఐ గాంధీనాయక్ అత్యుత్సాహం ప్రదర్శించడం విమర్శలకు తావిస్తున్నది.

ప్రశ్నించినందుకు కేసులు..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో దివ్యాంగులు, పేదల ఇండ్లను కూల్చివేయడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు నిలదీశారు. గులాబీ పార్టీ నేతలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ సూచనల మేరకు శ్రీకాంత్‌గౌడ్ దగ్గరుండి ఆశ్రయం కల్పించారు. బాధితులందరికీ పది రోజులపాటు ఉచితంగా అన్నదానం చేసి ఆదుకున్నారు. మద్దతు పెరగడంతో కాంగ్రెస్ నాయకులు పేదలను మభ్యపెట్టి బీఆర్ఎస్ నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేయించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దివ్యాంగులు, పేదల నోళ్లను నొక్కి వారికి అండగా నిలిచినందుకు శ్రీకాంత్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. అన్నం పెట్టినందుకు అక్రమంగా కేసులు పెడతారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్‌లో డైరెక్షన్..

కాంగ్రెస్ నేతల డైరెక్షన్‌లో బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా శ్రీకాంత్‌గౌడ్‌ను అరెస్ట్ చేసేందుకు హైదరాబాద్‌లో పథకం రచించినట్లు తెలుస్తున్నది. రెండ్రోజుల కిందట కాంగ్రెస్ చోటా మోటా నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి శ్రీకాంత్‌గౌడ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం విశేషం. దీంతో మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన డబుల్ బెడ్రూం ఇండ్ల అవకతవకల కేసునే కొనసాగిస్తూ కొత్తగా దీన్ని మార్చి కొంతమందిపై కేసులు నమోదు చేశారు. శ్రీకాంత్‌గౌడ్‌పై కూడా అక్రమంగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్వయంగా సోదరుడు శ్రీకాంత్‌గౌడ్‌ను తన వాహనంలో తీసుకొచ్చి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద దించారు. ఈ మేరకు శ్రీకాంత్ గౌడ్ పోలీసులకు లొంగిపోయారు. ఇది లాఉండగా, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరిగితే జీవో నెంబర్ 58 ప్రకారం రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ఉన్నదని, ఇది లీగలైజ్డ్ అని, అవసరమనుకుంటే పేదలకు ఆ జీవో ప్రకారమే అప్పట్లో సర్టిఫికెట్లు ఇప్పించేవారు..అంతేకానీ మాజీ మంత్రి తమ్ముడికి బోగస్ సర్టిఫికెట్లు సృష్టించాల్సిన అవసరమేంటని పోలీసులను బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

విచారణ జరిపి కోర్టులో హాజరుపరుస్తాం..

శ్రీకాంత్‌గౌడ్ రూరల్ పీఎస్‌కు వచ్చి లొంగిపోయారని మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోర్టులో హాజరుపరుస్తామని మీడియాకు వివరించారు. ఆదర్శనగర్‌లో ఏం జరిగిందనే దానిపై తమ వద్ద పూర్తి స్థాయిలో సాక్షాధారాలు ఉన్నాయని.., ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదన్నారు.

పురుగుల అన్నంతో పరేషాన్

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

- నిత్యం ఒకే ఆహారం తిన తేపోతున్నాం..
- పురుగులు తీసేసి భోజనం చేస్తున్నాం
- ఆకలితో తట్టుకోలేక బిస్కెట్ ప్యాకెట్లతో సర్దుకుంటున్నాం
- మహ్మదాబాద్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ఆవేదన

స్నాక్స్‌గా ఇస్తున్న పురుగులు పట్టిన శనగలు

మహ్మదాబాద్, అక్టోబర్ 25 : పురుగులు అన్నంతో అవస్థలు పడుతున్నామని మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులు, మాజీ సర్పంచులు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చింతపండు పులుసు, నీళ్ల చారు, కుళ్లిన వంకాయలతో వండిన కూర, ఉడికీఉడకని అన్నం చూసి అవాక్కయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ నిత్యం ఒకే రకమైన ఆహారాన్ని తిన తేపోతున్నామన్నారు. అన్నంలో వస్తున్న పురుగులను బయటకు తీసేసి తింటున్నామన్నారు. ఉదయం ఉడికీఉడకని కిచిడీ చేయడంతోపాటు మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని, చికెన్‌ను కూడా నీళ్ల చారు మాదిరిగా చేయడంతోపాటు కొసిరి కొసిరి పెడుతున్నారని గోడు వెల్లబోసుకున్నారు. వార్డెన్‌కు అయినా చెబుతామంటే వారానికి ఒకటి, రెండు సార్లు మాత్రమే వస్తున్నదన్నారు. ఆకలితో తట్టుకోలేక బిస్కెట్లు కొను క్కొని తింటున్నామన్నారు. అనంతరం మాజీ సర్పంచులు చంపాబాయి, గీతా, పాల్గుణ, ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి మండల అధ్యక్షుడు భాషా నాయక్ మాట్లాడుతూ శుక్రవారం మెనూ ప్రకారం ఆకుకూర పప్పు, సాంబారు బదులు చింతపండు నీళ్ల పప్పుచారు, కుళ్లిన కూరగాయల భోజనం పెట్టడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం ఇచ్చిన స్నాక్స్‌లో కూడా పురుగులు పట్టి పుచ్చిపోయిన శనగలను ఎండబెట్టి.. ఉడికించి అందించడమేంటన్నారు. అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు. వార్డెన్ నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండునాయక్, సంతోశ్, శ్రీనునాయక్, దేవేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాటు జరగకుండా చూస్తాం : వార్డెన్ పద్మ

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు సుకుంటాం. వివిధ కారణాలతో ముగ్గురు వర్కర్లు గైర్హాజరు కావడంతో ఒక్కరే ఉన్నారు. దీంతో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. మరోసారి పొరపాటు జరగకుండా చూస్తాను. వారంలో ఒకటి, రెండు రోజులు వస్తానన్నడంలో వాస్తవం లేదు.



గద్వాల జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్తున్న రైతులు

రుణం కోసం రణం

- జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత
- గేట్ మూసివేసి రైతులను అడ్డుకున్న పోలీసులు
- కర్షకులతో కలిసి నడిగడ్డ హక్కుల పోరాట సమితి నేతల ధర్నా
- రూ.2 లక్షల మాఫీతోపాటు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్
- కలెక్టర్ వచ్చి వినతిపత్రం అందుకోవడంతో సద్దుమణిగిన సమస్య

గద్వాల/గద్వాల రూరల్, అక్టోబర్ 25 : జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు, కర్షకులు డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా డబ్బులను ఖాతాల్లో జమచేయాలంటూ నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు రైతులు భారీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే, రైతులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులు మెయిన్ గేట్‌కు తాళం వేసి అడ్డుకున్నారు. దీంతో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ రైతులతో కలిసి గేటు ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం రైతులు గేట్‌ను తీసుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. కలెక్టర్ బయటకు వచ్చి తమ సమస్యలను వినాలని కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రైతులు భారీగా రావడంతో అందరినీ పంపించడం వీలుకాని నేపథ్యంలో కలెక్టర్ సంతోష్ బయటకు వచ్చి వినతిపత్రం అందుకున్నారు. ఆ తరువాత నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్‌తోపాటు కొందరు రైతులతో కలెక్టర్ మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం నుంచి రైతులు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

కొర్రీలతో కాలయాపన : రంజిత్‌కుమార్

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్.. గద్దెనెక్కి పది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మాఫీ చేయలేదన్నారు. రైతుబంధు కంటే ఎక్కువ పెంచి 'రైతు భరోసా' ఇస్తామన్న హామీకి ఇప్పటివరకు దిక్కులేదన్నారు. దీనికి తోడు వానకాలం సాగుకు రైతు భరోసా ఇవ్వమని స్వయాన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్, పట్టాదారు పాస్ బుక్కులలో ఉన్న రైతుల పేర్లలో చిన్న చిన్న తప్పులున్నాయన్న సాకుతో రుణమాఫీ చేయడం లేదని మండిపడ్డారు. కొర్రీలతో సర్కారు కాలయాపన చేయడంతోపాటు రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. కలెక్టర్లు బ్యాంకర్లతో సమావేశమై రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరారు. ఒక వైపు రుణమాఫీ చేశామని సీఎం, మంత్రులు గొప్పలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. చాలామంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుంటే జిల్లా నుంచి భారీ ఎత్తున రైతులతో అసెంబ్లీకి చేరుకొని నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ బ్రోకర్ అవతారం ఎత్తిందన్నారు. ప్రశ్నించే వారిని అణగదొక్కుతూ.. విద్యార్థులపై లాఠీచార్జి చేస్తూ.. అమానుష చర్యలకు దిగుతుందే తప్పా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు లవన్న, వెంకట్రాములు, బలరాముడు, గోవిందు, విష్ణు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో ఇంక్యుబేషన్ సెంటర్లు

సమీకృత అధునాతన సాంకేతిక కేంద్ర భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు

- స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా హబ్‌ఇన్‌స్పోక్
- రూ.1.50 లక్షలలోపు రైతులకు రుణమాఫీ చేశాం
- త్వరలోనే రూ.2 లక్షల వరకు మాఫీ..
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 25 : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డలో ఉన్న ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ఆవరణలో శుక్రవారం బాలురు, బాలికల సమీకృత అధునాతన సాంకేతిక కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన, డైట్ కళాశాలలో టాస్క్ స్థల పరిశీలన, మధురానగర్‌లోని రెడ్డి హాస్టల్‌లో మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కార్యాలయం, నవరత్నాలు వంటి తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్‌కు అనుగుణంగా ప్రతి యూనివర్సిటీకి ఒక ఇండస్ట్రీని అటాచ్ చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. పీయూలో సాంకేతికపరమైన ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాథమికంగా ఉన్న ఆలోచనలను సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో పాటు కొత్తగా ఏదైనా చేసేందుకు సైన్స్ సెక్టార్‌కు సంబంధించి ఈ సెంటర్ దోహదపడుతుందన్నారు. మానవ వనరులను అందిపుచ్చుకొని ప్రపంచస్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో టాటా టెక్నాలజీస్ సంస్థ ద్వారా రూ.2,200 కోట్లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.400 కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా 65 ఐఐటీలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో రూ.68 కోట్లతో ఏటీసీ భవనాలను నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఏర్పాటు చేయనున్న హబ్‌ఇన్‌స్పోక్‌లో వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ రంగంలో ఇంటర్న్‌షిప్ ఇచ్చి.. అది పూర్తయ్యే నాటికి ఉద్యోగావకాశాలు కల్పించే కార్యక్రమాన్ని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రారంభించినట్లు తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి కోరారు. ప్రజాపాలన ప్రభుత్వం రూ.17 వేల కోట్లతో రూ.1.50 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేశామని, అతి త్వరలో రూ.2 లక్షల రుణం ఉన్న వారికి మాఫీ చేస్తామన్నారు. అనంతరం దివిటిపల్లి వద్ద ఉన్న ఐటీ టవర్‌ను సందర్శించారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని అమరరాజా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో భూసేకరణ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్‌రెడ్డి, శ్రీహరి, శంకర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత, ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ శాంతయ్య, , ఆర్డీవో నవీన్, తాసీల్దార్ ఘన్సీరాం పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

- లారీతో తొక్కించిన ఎక్సైజ్ అధికారులు

మద్యం బాటిళ్లను లారీతో తొక్కిస్తున్న దృశ్యం

జడ్చర్ల, అక్టోబర్ 25 : మద్యం బాటిళ్లను ఎక్సైజ్‌శాఖ అధికారులు ధ్వంసం చేశారు. బూరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న ఎన్‌హెచ్-44 సర్వీస్ రోడ్డుపై శుక్రవారం బాటిళ్లను పరిచి లారీతో తొక్కించారు. జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ రెడ్డికథనం మేరకు.. బుధవారం రాత్రి ఓసీ క్వార్టర్ బాటిళ్ల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ జడ్చర్ల పట్టణంలో బోల్తా పడిన విషయం విదితమే. దీంతో లారీలోని మద్యం బాటిళ్లు కిందపడి పోవడంతో డ్యామేజ్ అయ్యాయి. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లూజ్‌గా ఉన్న, డ్యామేజ్ అయిన, లేబుళ్లు పోయిన 536 కాటన్ల ఓసీ క్వార్టర్ మద్యం బాటిళ్లను బూరెడ్డిపల్లి గ్రామం రోడ్డుపై పరిచి లారీతో తొక్కించి ధ్వంసం చేశారు. దీంతో మద్యం రోడ్డుపై ఏరులై పారింది. లేబుల్స్ డ్యామేజ్ కావడంతో స్కాన్ చేసేందుకు వీలు కాక పోవడంతో క్వాలిటీ అధికారులు పరిశీలన అనంతరం వాటిని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి వివరించారు. వీటి విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుందన్నారు. పంచనామా చేసి మంచిగా ఉన్న కాటన్‌లను డిస్టిలరీకి పంపామన్నారు.

సీతమ్మ తండాకు మిషన్ భగీరథ నీరు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నవాబ్‌పేట, అక్టోబర్ 25 : మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మదిర సీతమ్మతండాకు శుక్రవారం మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాను ప్రారంభించారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'సీతమ్మతండాలో తాగునీటికి తంటాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తండాలో తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో జయరామ్‌నాయక్ ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి సుష్మ, మిషన్ భగీరథ సిబ్బంది తండాకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

పెబ్బేరు సంతలో ఉద్రిక్తత

పెబ్బేరు, అక్టోబర్ 25 : పెబ్బేరు సంత వద్ద ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. రియల్‌ఎస్టేట్ వ్యాపారి నీలం గౌడ్ పట్టాదారులు, తన అనుచరులతో కలిసి శుక్రవారం సంతకు వెళ్లే దారులను జేసీబీ సాయంతో మూసివేస్తుండగా స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి పనులను అడ్డుకున్నారు. సంత స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ నీలంగౌడ్‌తో వాగ్వాదానికి దిగారు. తాను చట్టప్రకారమే సంత స్థలం స్వాధీనానికి వచ్చానని చెప్పినప్పటికీ ఘర్షణ వాతావరణం నెలకొన్నది. అనంతరం సంత స్థలం కబ్జాను కాపాడాలని పోలీస్‌స్టేషన్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు.

తాగునీటి బిల్లులు రద్దు చేయాలి

- భూత్పూర్ మున్సిపాలిటీ ఎదుట బీఆర్ఎస్ నేతల ధర్నా

భూత్పూర్ ధర్నాలో మాట్లాడుతున్న ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్, అక్టోబర్ 25 : మున్సిపాలిటీ పరిధిలోని తాగునీటి బిల్లులు రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఫిల్టర్ చేసిన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు వందల కిలోమీటర్ల మేర పైపులైన్లను ఏర్పాటు చేసి.. ఇంటింటికీ ఉచితంగా నల్లా కనెక్షన్లు ఇచ్చిందన్నారు. మిషన్‌భగీరథ నీటిని తాగి ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పి నల్లా బిల్లులు వసూలు చేయడం మోసపూరితమని మండిపడ్డారు. నల్లా బిల్లులను ఆన్‌లైన్ ద్వారా వసూలు చేయడం సమంజసం కాదన్నారు. ఇండ్లకు కూడా అధిక ట్యాక్స్‌ను వసూలు చేస్తున్నారని, దీనిపై కూడా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆదాయ వనరులను పెంచాలే కానీ, పేదల నుంచి ఇష్టానుసారంగా బిల్లులు వసూలు చేయడం సరైంది కాదన్నారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామకృష్ణ, బాలకోటి, కో-ఆప్షన్ మెంబర్లు అజీజ్, జాకీర్, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్ గౌడ్, చంద్రమౌళి, నాయకులు నారాయణగౌడ్, మురళీధర్ గౌడ్, సత్యనారాయణ, యాదయ్య, అశోక్‌గౌడ్, రామునాయక్, సాధిక్, యాసీన్, అహ్మద్, సురేశ్‌గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పాతసామాను ఆటోలో
ఓటరు కార్డులు

- విలువైన ధ్రువీకరణ పత్రాలకు భద్రతేదీ..?
- ఆందోళన చెందుతున్న ప్రజలు

పాతసామాను విక్రేత ఆటోలో లభించిన ఓటరుకార్డులు

గట్టు, అక్టోబర్ 25 : ఆధార్, ఓటరు, పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయని బీపీఎంను సస్పెండ్ చేసిన విషయాన్ని మరువకముందే గట్టు మండలంలో మరో సంఘటన చోటుచేసుకున్నది. మండలంలోని తుమ్మలచెర్వు గ్రామంలో పాత సామాను విక్రేత ఆటోలో ఓటరుకార్డులు దర్శనమిచ్చాయి. గద్వాలకు చెందిన వ్యక్తి పాత సామానును కొనుగోలు చేసేందుకు ఆటోలో గురువారం తుమ్మల చెర్వుకు వచ్చారు. వివిధ వీధుల్లో తిరిగి పలువురి నుంచి పాత సామానులను కొనుగోలు చేశాడు. అనంతరం హోటల్ వద్ద ఆగి ఆటోలో సామానులను సర్దుతుండగా ఓటరు కార్డులు కనిపించగా.. హోటల్ యజమానికి అప్పగించారు. కాగా, ఈ ఓటరుకార్డులు 2014కు చెందినవిగా తెలుస్తున్నది. అయితే, ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి..? బీఎల్‌వోలు పంపిణీ చేయకుండా తమ వద్దే ఉంచుకున్నారా..? లేదా ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో అధికారులు విచారణ చేయాల్సి ఉన్నది. విలువైన ధ్రువీకరణ పత్రాలకు భద్రత లేకుండా పోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.